కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

రామడుగు: వెదిరలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, ధాన్యం తేమను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

- కలెక్టర్ పమేలా సత్పతి
- వెదిరలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం

రామడుగు, అక్టోబర్ 16: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు కనీస మద్దతు ధర లభిస్తుందని, ఆరుగాలం పండించిన పంటను సర్కారు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. రామడుగు మండలం వెదిర అనుబంధ గ్రామం కోనరావుపేటలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ముఖ్యంగా ధాన్యం విక్రయాల్లో నాణ్యత పాటించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండల వ్యవసాయ అధికారితో మాట్లాడుతూ, మండలంలో ఇంకా ఎంతమంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందని అడుగగా, రుణమాఫీ అయిన రైతుల వివరాలు మాత్రమే ఉన్నాయని, అందని వారి సమాచారం లేదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్‌డీవో శ్రీధర్, పౌర సరఫరాల శాఖ డీఎం రజినీకాంత్, మండల ప్రత్యేకాధికారి అనిల్‌ప్రకాశ్‌కిరణ్, అడిషనల్ డీఆర్‌డీవో సునీత, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాజేశ్వరి, ఏవో ప్రభావతి, ఏపీవో రాధ, ఏపీఎం ప్రభాకర్, గోపాల్‌రావుపేట ఏఎంసీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమల, కొక్కెరకుంట విండో చైర్మన్ వొంటెల మురళీకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గంగాధర, అక్టోబర్ 16 : మండలంలోని గర్శకుర్తిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్‌డీవో సునీత, తహసీల్దార్ అనుపమ, ఎంపీవో జనార్దన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితా శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, ఏపీఎం పవన్‌కుమార్, నాయకులు కంకణాల రాజ్‌గోపాల్‌రెడ్డి, పురుమల్ల మనోహర్, రామిడి రాజిరెడ్డి పాల్గొన్నారు.

చొప్పదండి, అక్టోబర్ 16: మండలంలోని కాట్నపల్లి, గుమ్లాపూర్ గ్రామాల్లోని గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

11 నుంచి 'కిట్స్'లో వర్క్‌షాపు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఒడితెల సతీశ్‌కుమార్

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 16: సింగాపూర్ గ్రామంలోని కమల ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో నవంబర్ 11 నుంచి 16 వరకు నిర్వహించనున్న వర్క్‌షాపు పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే, కిట్స్ కళాశాలల కార్యదర్శి ఒడితెల సతీశ్ కుమార్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, న్యూఢిల్లీ సహకారంతో ఈ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో దేశంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అధ్యాపకులు, పరిశ్రమల్లో పనిచేస్తున్న ఇంజినీర్లు పాల్గొంటారని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే శంకర్ మాట్లాడుతూ.. ఎనర్జీ సెక్టార్‌లో వస్తున్న ఆధునిక మార్పులను నూతన సాంకేతిక పరిశోధన ఫలితాలను ఈ సదస్సులో చర్చిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కే ఈశ్వరయ్య, డాక్టర్ యోగేశ్ పుండలీక్, డాక్టర్ వి. రాజేశ్వరరావు, డాక్టర్ జి .మల్లయ్య, డాక్టర్ ఏ కొమురయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌత్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

కొత్తపల్లి, అక్టోబర్ 16 : గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 17 నుంచి 19 వరకు జరిగే సౌత్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా క్రీడాకారులు అర్హత సాధించినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన పదో రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు ఇ. విష్ణువర్ధన్, ఎం. వినయ్ మొదటిస్థానంలో నిలిచి సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అలాగే, జిల్లాకు చెందిన మరో క్రీడాకారిణి గైని నక్షత్ర సౌత్ ఇండియా పోటీలకు అర్హత సాధించిందన్నారు. వీరిని జిల్లా యువజన క్రీడాశాఖాధికారి వి. శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ క్రీడాకారులు హరికిషన్, కటకం రవి కుమార్, బి. రాజగోపాలాచారి, జబ్బీందర్ సింగ్ తదితరులు అభినందించారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 16: నియోజకవర్గంలో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నదని బీజేపీ జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్ ఆరోపించారు. పెద్ద పాపయ్యపల్లె గ్రామంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ బాబు గ్రామానికి ఐదుగురు చొప్పున కాంగ్రెస్ కార్యకర్తలను కమిటీకి ఎంపిక చేసినట్టు ఆరోపించారు. ఇలా అయితే నిరుపేదలకు నిలువనీడ కరువవుతుందన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి సర్వసభ్య సమావేశాలు నిర్వహించి, ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని కరుణాకర్ డిమాండ్ చేశారు.

విద్యార్థుల భారీ ర్యాలీ

జమ్మికుంట(వీణవంక), అక్టోబర్ 16: తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల అసోసియేషన్ చేపట్టిన నిరవధిక బంద్‌లో భాగంగా 3వ రోజు జమ్మికుంట పట్టణంలోని ప్రైవేట్ కళాశాలల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా గాంధీచౌక్ వద్ద విద్యార్థులు ధర్నా చేశారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని, మరోవైపు తాము అప్పుల్లో కూరుకుపోతున్నామని పలువురు ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్‌ను కలిసిన టీఎన్జీవోల సంఘం నాయకులు

కలెక్టరేట్, అక్టోబర్ 16 : సీపీఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్‌గా ఇటీవల బదిలీపై డీఆర్ కార్యాలయానికి రాగా, బుధవారం ఆయనను టీఎన్జీవోల సంఘం జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి తేవాలన్నారు. స్థితప్రజ్ఞను కలిసిన వారిలో టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌రావు, టీజీవో నాయకుడు మడిపల్లి కాళీచరణ్, సహాధ్యక్షుడు ఒంటెల రవీందర్‌రెడ్డి, కేంద్ర సంఘం నాయకుడు రాగి శ్రీనివాస్, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్‌సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్‌నారాయణ, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పరామర్శ

ఎలుబాకలో రవి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

వీణవంక, అక్టోబర్ 16: మండలంలోని ఎలుబాక గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మద్దుల రవి మృతిచెందగా, భౌతిక కాయాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులతో పాటు పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇక్కడ సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కాంతారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఊట్ల దేవయ్య, నాయకులు కోట శ్రీనివాస్‌రెడ్డి, లూకా, శంకర్ తదితరులు ఉన్నారు.

సీడీఎంఏకు వినతుల వెల్లువ

కార్పొరేషన్, అక్టోబర్ 16: కరీంనగర్ నగరపాలక సంస్థలో బుధవారం పర్యటించిన సీడీఎంఏ గౌతమ్‌కు పాలకవర్గ సభ్యులు, నగరపాలక ఉద్యోగులు, కాంట్రాక్టర్ల సంఘ నాయకుల నుంచి పలు అంశాలపై వినతులు వెల్లువెత్తాయి. వీటన్నింటిపై తగు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు లేటర్ ప్యాడ్‌పై నగరాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు వినతిపత్రం అందించారు. నగరపాలక సంస్థలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేయాలని కాంగ్రెస్ కార్పొరేటర్లు ఫిర్యాదు చేశారు. అధికారుల పనితీరుపై కూడా ఫిర్యాదు అందించారు. నగరంలో సీఎం అస్యూరెన్స్ కింద చేపట్టిన పనులను అసంపూర్తిగా వదిలేసిన కాంట్రాక్టర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీహరిశంకర్ సీడీఎంఏకు వినతిపత్రం అందించారు. తమకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఇప్పించాలని కరీంనగర్ మున్సిపల్ కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం నాయకులు విన్నవించారు. బల్దియాలోని ప్రభుత్వ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను డిప్యూటీ కమిషనర్ వివిధ కారణాలతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని నగరపాలక సంస్థ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు సీడీఎంఏకు విన్నవించారు.

పాత పింఛన్ విధానం అమలు చేయాలి

కలెక్టరేట్, అక్టోబర్ 16 : ప్రభుత్వోద్యోగులకు అమలు చేస్తున్న కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి తేవాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎండీ.రాజ్‌మహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని మంకమ్మతోటలో గల ఆసంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సీపీఎస్ ఉద్యోగుల జిల్లా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ స్థానంలో ఓపీఎస్‌ను అమల్లోకి తేవాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు రామ్మోహన్, వి.ఇందిరాదేవి, మహ్మద్ అబ్బాస్, తేజ్‌దీప్ వర్మ, రాములు, రాజ్‌కుమార్, బి.శ్రీనివాస్, కలకోట విష్ణువర్ధన్‌తో పాటు వందమందికి పైగా ఉద్యోగులు పాల్గొన్నారు.

సింగరాయ గుడి పరిశీలన

సైదాపూర్, అక్టోబర్ 16: మండలకేంద్రంలోని ప్రాచీన సింగరాయ దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పలువురు నాయకులు, గ్రామస్తులు విజ్ఞప్తి చేయగా, ఆయన దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడారు. ఈ క్రమంలో బుధవారం దేవాదాయశాఖ అధికారులు సింగారయగుడితో పాటు ఆలయ ఆవరణలోని లక్ష్మీనర్సింహస్వామి విగ్రహం, గుట్ట పరిసరాలను పరిశీలించారు. వీరి వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, సింగిల్‌విండో డైరెక్టర్ బొమ్మగాని రాజుగౌడ్, నాయకులు కామని వీరేశం, గోపగోని నవీన్‌కుమార్‌గౌడ్, అనగోని శ్రీనివాస్‌గౌడ్, కూతురు విద్యాన్‌రెడ్డి, బోనగిరి అనిల్, పూసాల రమేశ్, రమేశ్, వెంకట్రాజం, కుమార్, శ్రీధర్, సాయికుమార్, రాహుల్, తదితరులు ఉన్నారు.

నేత్రదాత కుటుంబానికి సన్మానం

సైదాపూర్, అక్టోబర్ 16: దుద్దనపల్లి గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ రమేశ్‌సింగ్ ఇటీవల మృతిచెందగా, ఆయన కుటుంబసభ్యులు నేత్రదానానికి ముందుకు వచ్చి నేత్రాలను అందించారు. బుధవారం దుద్దనపల్లిలో తెలంగాణ నేత్ర, అవయవ శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌సింగ్ కుటుంబసభ్యులను శాలువాతో సన్మానించారు. గ్రామస్తులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు, సలహాదారు తాటిపల్లి జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా సదానందాచారి

సదానందాచారి

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 16 : తెలంగాణ లెక్చరర్స్ ఫోరం జిల్లా నూతన అధ్యక్షుడిగా ముత్తోజు సదానందాచారి నియమితులయ్యారు. ఈ మేరకు టీఎల్ఎఫ్ రాష్ట్ర కోఆర్డినేటర్ పోకల నాగయ్య వెల్లడించారు. అలాగే, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బొంగోని రాజు, జిల్లా ఉపాధ్యక్షుడిగా సాయి బాబు, జిల్లా కన్వీనర్‌గా దేవరకొండ అశోక్, జిల్లా జాయింట్ సెక్రటరీగా రవికుమార్, సెక్రటరీగా ముద్దసాని సంపత్, ఉపాధ్యక్షుడిగా వనపర్తి రాము, ట్రెజరర్‌గా విస్‌డమ్ సతీశ్, సెక్రటరీగా బొంగోని శంకర్, నగర అధ్యక్షుడిగా రంగోజు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా విలాసాగర్ మధుకర్, జాయింట్ సెక్రటరీగా వనపర్తి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా నగేశ్, కన్వీనర్‌గా లక్ష్మణ్, సెక్రటరీగా పెండ్యాల శ్రీకాంత్ నియమితులయినట్లు వివరించారు. కార్యక్రమంలో టీఎల్ఎఫ్ స్టేట్ సెక్రటరీ సత్యనారాయణ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణకు అనుమతి ఇప్పించండి

తిమ్మాపూర్, అక్టోబర్16: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గతంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణకు ప్రభుత్వం నుంచి అనుమతి మంజూరు చేయించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘ నాయకులు వంతడుపుల సంపత్, పారునంది జలపతి ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

జూబ్లీనగర్‌లో ఓపెన్ జిమ్, హైమాస్ట్ లైట్స్ ప్రారంభం

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 16: మండలంలోని జూబ్లీనగర్ గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్, హైమాస్ట్ లైట్స్‌ను కాంగ్రెస్ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రుద్ర భారతి, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అనేక లాభాలు

రామడుగు, అక్టోబర్16 : ఆయిల్‌పామ్ పంట సాగుతో రైతులకు అనేక లాభాలు ఉన్నాయని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ, ఉద్యానవన శాఖతో పాటు లోహియా ఎడిబుల్ ఆయిల్స్ ఆధ్వర్యంలో బుధవారం ఆయిల్‌పామ్ పంట సాగుపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆసక్తి కలిగిన రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ కల్పిస్తున్నదన్నారు. మరిన్ని వివరాలకోసం ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రియదర్శిని, సర్కిల్ ఉద్యానవన అధికారి రోహిత్, మండల వ్యవసాయ అధికారి ప్రభావతి, లోహియా సీఈవో సిద్ధాంత్, మేనేజర్ భారత్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రవణ్‌కుమార్, ఏఈవోలు పాల్గొన్నారు.

రైస్‌మిల్ ఏర్పాటుకు భూమి కేటాయించాలని వినతి

గంగాధర, అక్టోబర్ 16 : గంగాధర వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కొండాయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రైస్ మిల్ ఏర్పాటు కోసం 6 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కోరారు. ఈ మేరకు బుధవారం కరీంనగర్‌లో ఎమ్మెల్యే సత్యంను కలిసి వినతిపత్రం అందజేశారు. భూమి కేటాయింపునకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఇక్కడ సింగిల్ విండో వైస్ చైర్మర్ వేముల భాస్కర్, డైరెక్టర్ బెజ్జంకి కళ్యాణ్, నాయకులు భైరిశెట్టి సంపత్, పెంచాల చందు ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించడంపై హర్షం

మండలంలోని కోట్లనర్సింహులపల్లి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.2.55 కోట్లు, ముప్పిడినర్సయ్యపల్లి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.1.80 కోట్ల నిధులు కేటాయించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కరీంనగర్‌లోని ఆయన నివాసంలో గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిశారు. రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించిన సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ నాయకులు తోట మల్లారెడ్డి, పబ్బతి తిరుపతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

రామడుగు, అక్టోబర్ 16 : గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని అటల్ థింకరింగ్ ల్యాబ్‌లో చోరీ జరిగినట్లు మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ తెలిపారు. దసరా సెలవుల్లో భాగంగా ప్రయోగశాలకు తాళం వేసి, సీల్ వేశామని, సెలవుల అనంతరం పాఠశాలకు వచ్చి చూడగా ల్యాబ్‌లో చోరీ జరిగిందని చెప్పారు. గుర్తుతెలియని వ్యక్తులు ల్యాబ్ వెనుకవైపు కిటికీ చువ్వలను తొలగించి లోపలికి ప్రవేశించి సుమారు రెండు లక్షలకు పైగా పరికరాలను ఎత్తుకెళ్లారని తెలిపారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టామని ఎస్ఐ శేఖర్ పేర్కొన్నారు.

తాగునీటి సరఫరా సహాయకులకు శిక్షణ

చొప్పదండి/శంకరపట్నం, అక్టోబర్ 16: జీపీ కార్మికులు, తాగునీటి సరఫరా సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం శంకరపట్నం, చొప్పదండి మండల పరిషత్ సమావేశ మందిరాల్లో ప్రారంభించారు. మొదటి రోజు బోరింగ్ నిర్వహణ, మెకానిక్ నిర్వహణ, మరమ్మతులు చేయించడం తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ ఇచ్చారు. శంకరపట్నంలో శిక్షణను మిషన్ భగీరథ (ఇంట్రా) డీఈ ఖాజా వసీయొద్దీన్ పరిశీలించి మాట్లాడారు. ఇక్కడ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మొగిలి ఉన్నారు. చొప్పదండిలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శంకరయ్య, ఎంపీడీవో వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినయ్ అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన జీవితం కోసం పోషకాహారం తీసుకోవాలి

కలెక్టరేట్, అక్టోబర్ 16 : వృద్ధాప్యంలో మెరుగైన జీవనం కొనసాగించేందుకు సరైన పోషకాహారం తీసుకోవాలని సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు సముద్రాల జనార్దన్ రావు సూచించారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నగరంలోని జడ్పీ క్వార్టర్స్‌లో గల సీనియర్ సిటిజన్స్ డేకేర్ సెంటర్‌లో నిర్వహించిన ఆహార అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముక్క శరత్‌కృష్ణ ఆధ్వర్యంలో రైతు ప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో సింగంరాజు, ఉచ్చిడి మోహన్‌రెడ్డి, పెండ్యాల కేశవరెడ్డి, భూంపల్లి మోహన్‌రెడ్డి, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్చరీలో వివేకానంద విద్యానికేతన్ విద్యార్థిని సత్తా

కొత్తపల్లి, అక్టోబర్ 16 : స్థానిక భగత్‌నగర్‌లోని వివేకానంద విద్యానికేతన్‌లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని రామిళ్ల అనయ జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ చూపి సిల్వర్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ మిథున్ జే మిస్త్రీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఎస్ఎఫ్ఏ సీజన్-6 చాంపియన్ పోటీల్లో పాల్గొన్న అనయ అండర్-10 బాలికల విభాగంలో రెండో స్థానంలో నిలిచి పతకం సాధించిందని తెలిపారు. విద్యార్థినిని పాఠశాల చైర్మన్, వైస్ ప్రిన్సిపాల్ సాగర్, ఏవో తుంగాని సంపత్, పీఈటీలు మధునయ్య, భాను ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

'రుణ గ్రహీత ఆరోపణలో నిజం లేదు'

శంకరపట్నం, అక్టోబర్ 16: గోల్డ్ లోన్ అంశంలో అవకతవకలు జరిగాయన్న రుణగ్రహీత ఆరోపణలో నిజం లేదని మొలంగూర్ ఇండియన్ బ్యాంక్ మేనేజర్ శ్రావణ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, తమ బ్యాంక్ 80 సంవత్సరాలుగా విశ్వసనీయతకు మారు పేరుగా నిలుస్తున్నదన్నారు. రెండు సంవత్సరాల క్రితం మొలంగూర్ ఇండియన్ బ్యాంక్‌లో లోన్ కోసం 114 గ్రాముల బంగారు ఆభరణాలు కుదువబెట్టిన కొత్తగట్టు గ్రామానికి చెందిన కందుల విజయ, సోమవారం వాటిని విడిపించుకునే క్రమంలో బంగారం బరువులో 15 గ్రాములు ఎక్కువ వస్తున్నదని, అలాగే గాజుల జత కనిపించడం లేదని ఆభరణాలు తీసుకోకుండానే ఇంటికి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. తిరిగి బుధవారం విజయ కుటుంబ సభ్యులతో కలిసి బ్యాంక్‌కు వచ్చారు. సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. బ్యాంక్ మేనేజర్ వివరణ వినడంతో పాటు గాజుల విషయం రశీదులో లేకపోవడంతో చివరికి విజయ తన ఆభరణాలను తీసుకున్నారు. అనంతరం మేనేజర్ శ్రావణ్ మాట్లాడుతూ.. తమ బ్యాంక్ నుంచి ఇచ్చిన రశీదులో గాజులు ఉన్నట్లు లేదని తెలిపారు. బరువు పొందుపరచడంలో మాత్రం పొరపాటు చోటు చేసుకుందని అంగీకరించారు. గ్రాస్ వేట్ వాళ్లు అనుకున్నదాని కంటే అదనంగానే ఉందని వెల్లడించారు. ఒకవేళ ఎవరికైనా తూకంలో తక్కువ వస్తే మాత్రం తమ బ్యాంకే బాధ్యత వహిస్తుందన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 16 : కరీంనగర్‌లోని విస్‌డమ్ అకాడమీలో స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయనున్న తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర సమన్వయకర్త పోకల నాగయ్య ఎమ్మెల్సీ ఓటర్ నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్ద కాలంగా నిరుద్యోగ, అధ్యాపకుల సమస్యలపై నిరంతరం పోరాడి, అనేక సమస్యలను పరిష్కరించానని తెలిపారు. తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఇక్కడ టీఎల్ఎఫ్ నాయకులు సత్యనారాయణ రాజు, ముత్తోజు సదానందాచారి, బొంగోని రాజు, దేవరకొండ అశోక్, ముద్దసాని సంపత్, వనపర్తి రాము, సతీశ్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, అక్టోబర్ 16: చల్లూరు మానేరువాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ నవీన్, చల్లూరు గ్రామానికి చెందిన బొంగోని కుమార్, బొంగోని సదయ్య, తూడి రాజు ఎలాంటి అనుమతి లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను రవాణా చేస్తుండగా పట్టుకొని, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పది మందిపై కేసు

హుజూరాబాద్, అక్టోబర్ 16: ఇసుక అక్రమ తరలింపులో విలాసాగర్, తనుగులకు చెందిన పదిమంది ట్రాక్టర్ డ్రైవర్లపై సీఐ రవి కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శంభునిపల్లి పరిధిలోని పరిమళకాలనీలో గల ఇసుకడంపు నుంచి పలువురు ఇసుక ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్ల అక్రమంగా ఇసుకను తరలించారు. దీనిపై తనుగులకు చెందిన శ్రీను ఫిర్యాదు మేరకు విచారణ చేసి 10మందిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఇసుకను తరలించిన ట్రాక్టర్లతో పాటు, ఇసుక నింపడానికి ఉపయోగించిన రెండు జేసీబీలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

మానసిక వికలాంగుల పాఠశాల సందర్శన

తిమ్మాపూర్,అక్టోబర్16: ఎకరీంనగర్‌లోని మనోవికాస్ మేథో వికలాంగుల పాఠశాల వృత్తి విద్యాకేంద్రాలను జిల్లా న్యాయసేవా ధికార సంస్థ చైర్మన్, జడ్జి వెంకటేశ్ బుధవారం సందర్శించారు. పాఠశాలల్లో వికలాంగ విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వారికి న్యాయసేవ అవసరమైతే సంప్రదించాలని సూచించారు. అలాగే పండ్లు పంపిణీ చేశారు. లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాలికుంటుతో పశువులకు ప్రమాదం

శంకరపట్నం, అక్టోబర్ 16: గాలికుంటు వ్యాధి నివారణ చర్యలు చేపట్టకపోతే పశువులు, వాటి పాలు తాగిన దూడలు మృత్యువాత పడే ప్రమాదం ఉందని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ వేణుగోపాలరావు హెచ్చరించారు. బుధవారం రెండో రోజు మండలంలోని మొలంగూర్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ఏర్పాటు చేయగా, జిల్లా అధికారి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం వైద్య శిబిరంలో 186 పశువులకు టీకాలు వేసినట్లు మొలంగూర్ పశు వైద్యాధికారి డాక్టర్ మాధవరావు తెలిపారు. ఇక్కడ పశు వైద్య సిబ్బంది, గోపాల మిత్రలు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి శబరిమల మహాపాదయాత్ర

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 16 : జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ జడ్పీ క్వార్టర్స్ హరహర క్షేత్రం అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి శబరిమల మహ పాద యాత్ర ప్రారంభిస్తున్నట్లు గడప నాగరాజు గురుస్వామి పేర్కొన్నారు. బుధవారం ఆయన హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ పాదయాత్ర కరీంనగర్ నుంచి హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు మీదుగా కేరళలోని అయ్యప్ప స్వామి సన్నిధానానికి నవంబర్ 29న చేరుకుంటుందని వివరించారు. ఈ యాత్రలో 100 మంది అయ్యప్ప స్వామి భక్తులు భాగస్వాములవుతున్నారని తెలిపారు. పాదయాత్ర ప్రారంభానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆకాంక్షించారు. ఇక్కడ స్వాములు డి. సంపత్, బండారి శ్రావణ్, శ్రీహరి యాదవ్, కర్ణాల రాము, గంగుల సురేశ్, వేములవాడకు చెందిన హరీశ్, గురువయ్య, ఐలేని వేణుగోపాలరావు, శ్రీనివాస్, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

మత్తుపదార్థాల కట్టడిలో భాగస్వాములు కావాలి

రామడుగు, అక్టోబర్16 : మత్తుపదార్థాల కట్టడిలో విద్యార్థులు భాగస్వాములు కావాలే కానీ, వాటి బారినపడి జీవితాలను నాశనం చేసుకోరాదని యాంటీనార్కోటిక్ డ్రగ్ సెల్ ఏసీపీ మాధవి పేర్కొన్నారు. గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో గంజాయి, మత్తుపదార్థాల నియంత్రణపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా ఏసీపీ మాధవి పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశనుంచే మత్తుపదార్థాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా ఎక్కడైనా మత్తుపదార్థాలు వినియోగిస్తున్నా, ఎవరైనా విక్రయిస్తున్నా పోలీసులకు సమాచారం అందించి, బాధ్యతగల పౌరుడిలా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యాంటీ నార్కోటిక్ డ్రగ్ విభాగం సీఐ సరిలాల్, రామడుగు ఎస్ఐ శేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్ నిర్మాణ పనుల పరిశీలన

గన్నేరువరం, అక్టోబర్ 16: మండలంలోని గుండ్లపల్లి స్టేజీ నుంచి మండల కేంద్రం గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులను క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ పుల్లా దాస్ బుధవారం పరిశీలించారు. గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్ గ్రామాల్లో సీసీ, మట్టి, కంకర, రోడ్ విస్తరణ, కాల్వర్టుల నిర్మాణాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

రతన్ టాటాకు ఘన నివాళి

విద్యానగర్, అక్టోబర్ 16: దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటాకు టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కరీంనగర్ బ్రాంచ్ సిబ్బంది నగరంలోని కెప్టెన్ రఘునందన్ రావు కూడలిలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లస్టర్ హెడ్ సాయినాథ్, బ్రాంచ్ హెడ్ సూర రామకృష్ణారెడ్డి, సంస్థ హెడ్ ట్రైనర్ శ్యాం ప్రసాద్, నరేందర్ రావు, వీరస్వామి, ఆదర్శ్, చంద్రశేఖర్ గౌడ్, వెంకటేశ్ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కళోత్సవాలకు ఎంపిక

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 16: మానకొండూర్ మండల కేంద్రంలో బుధవారం మండల స్థాయి కళోత్సవాల ఎంపికను నిర్వహించారు. మండలంలోని పోచంపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు వివిధ అంశాల్లో అత్యుత్తమ ప్రదర్శన చూపి జిల్లా స్థాయికి ఎంపిక కాగా, వారిని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

పాఠశాలలను సందర్శించిన డీఈవో

కమాన్‌చౌరస్తా/హుజూరాబాద్ రూరల్(టౌన్), అక్టోబర్ 16 : జిల్లా కేంద్రంలోని కోతిరాంపూర్, హుజూరాబాద్ మండలం చెల్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను బుధవారం జిల్లా విద్యాశాఖధికారి సీహెచ్ వీఎస్ జనార్దన్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించి సంతృప్తి చెందారు. విద్యార్థులు విధిగా యూనిఫాం ధరించాలని చెప్పారు. ప్రతి రోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి, ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి పోటీలో సత్తా చాటిన జిల్లా రెజ్లర్లు

కొత్తపల్లి, అక్టోబర్ 16: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెజ్లర్లు సత్తా చాటారు. హైదరాబాద్‌లో ఈనెల 15, 16వ తేదీల్లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్ -19 రెజ్లింగ్ పోటీల్లో పాల్గొన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన క్రీడాకారులు మూడు రజత, ఆరు కాంస్య పతకాలు సాధించారు. రుక్మాపూర్ సైనిక్ పాఠశాలకు చెందిన పి.విజయ్ కుమార్, టి.సిద్ధార్థ రజత పతకాలు, బి.నర్సింహ, కె.రాజరథన్, ఎన్.దినేశ్ కాంస్య పతకాలు గెలుపొందారు. ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ జూనియర్ కళాశాలకు చెందిన కె.రాజు రజతం, కె.అజయ్ కాంస్య పతకం, అల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు చెందిన వి. రఘు చరణ్ కాంస్య పతకం, ట్రినిటీ జూనియర్ కళాశాలకు చెందిన సీహెచ్ ఆదిత్య మహారాజ్ కాంస్య పతకం సాధించినట్లు టీం కోచ్ ఎం.వంశీకృష్ణ తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, కళాశాలల క్రీడా సమాఖ్య కరీంనగర్ జిల్లా కార్యదర్శి మధు జాన్సన్ అభినందించారు.

అద్వితలో ఎస్జీఎఫ్ చెస్ టోర్నమెంట్

కొత్తపల్లి, అక్టోబర్ 16 : 68వ పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) జిల్లాస్థాయి అండర్-14, 17 చెస్ టోర్నమెంట్‌ను బుధవారం స్థానిక అద్విత ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించారు. జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టోర్నమెంట్‌ను స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ అనుదీప్ సొగాని ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెస్‌తో విద్యార్థుల్లో మేథోశక్తి పెరుగుతుందని, ఈ క్రీడలో ప్రతిభ చూపిన వారు అన్ని రంగాల్లో విశేషంగా రాణిస్తారన్నారు. పలు పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, అర్బన్ కార్యదర్శి శంకరయ్య, అద్విత ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ మధురి శ్వేత, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

22న జిల్లా కమిటీ ఎన్నికలు

తెలంగాణచౌక్, అక్టోబర్ 16: నగరంలోని కేసీఆర్ భవనం సమీపంతోని నాయీబ్రాహ్మణ కళ్యాణ మండపంలో ఈ నెల 22న తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కమిటీ నూతన కార్యవర్గ ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు నర్సయ్య, జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య, నగర గౌరవాధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, నగర అధ్యక్షుడు జంపాల సంపత్ తెలిపారు. నగరంలోని సంఘ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఉదయం 11 గంటలకు ఎన్నికలు ప్రారంభవుతాయన్నారు. జిల్లాలోని 16 మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

వ్యవసాయాధికారిగా మండల వాసి ఎంపిక

ఇల్లందకుంట, అక్టోబర్ 16: అగ్రికల్చర్ ఆఫీసర్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన గన్ను సింధూజ ఓపెన్ కేటగిరీలో 31వ ర్యాంక్ సాధించి వ్యవసాయాధికారిగా ఎంపికైంది. బుధవారం ధర్మపురి మండల వ్యవసాయాధికారిగా నియామక పత్రం పొందింది. సింధూజ వ్యవసాయాధికారిగా ఎంపికావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

తిమ్మాపూర్, అక్టోబర్16: మండలంలోని రామకృష్ణకాలనీ గ్రామంలో గల వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ధీకొండ లక్ష్మీనారాయణకు పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. 'డిజైన్ అండ్ అప్లికేషన్ ఆఫ్ టెరాహెర్జ్ మెటోమెటీరియల్ అబ్జర్వర్' అంశంపై చేసిన పరిశోధనకు గానూ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల సెక్రటరీ గంగ్ర శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ డీ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ వినోద్, ప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, హెచ్‌వోడీ వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s: Shriram Finance Limited, Huzurabad Branch. I issue the following notice to general public. My client intends to grant to loan to title Veldi Srinivas, S/o: Rajamouli, Age: 47 years, Occ: Business, R/o: H.No. 1-64/3, Deshrajipalli village Kamalapur mandal of Hanamakonda dist by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges mortgages, Sale agreements Court Attachment, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice otherwise, later objections will not bind my client in this regard

SCHEDULE OF THE PROPERTY

All that the piece and parcel of Agriculture land admeasuring Ac: 0.0550 guntas, (the said land was conversation to the NALA vide NALA order procedings No. 2100117592 dated 08-02-2021) the Sy.No. 1244/E/1 to an extent of 0.275 guntas and Sy.No. 1244/F/1 to an extent of 0.275 guntas, within the boundaries
North: Agriculture land of Raparthi Ramaswamy
South: Road
East: Road
West: Agriculture land of Keerthi Rajamallamma
is situated at Veenavanka village and mandal of Karimnagar dist
Date: 16-10-2024

Sd/- **G. LAXMANA MURTHY,** Advocate
Huzurabad. Cell No. 94403 69866

నమస్తే తెలంగాణ CLASSIFIED

కావలెను

jobs Apply Now!

★ మ్యారేజ్ బ్యూరో నందు పని చేయుటకు అమ్మాయి కావాలి. చదువుతో నిమిత్తం లేకుండా మంచి వాక్చాతుర్యం గల నమ్మకంతో పర్మినెంట్‌గా పనిచేసే అమ్మాయి కావలెను. సంప్ర|| సెల్: 8341220970
NTK-335282

CHANGE OF NAME

★ **I, Vadlamani Girija** R/o. 1-5-50/1, Jagtial, T.G. Have changed my name as **VADLAMANI GIRIJA ANNAPURNA W/o. SATYANARAYANA MURTHY.**
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189